క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 18, బెండ 23, పచ్చి మిర్చి 28, కాకర 23, బీర 23, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 32, దొండ 18, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 30, ఆలు 21, దోస 18, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 28. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మలక్‌పేట సీటు మైనార్టీలకు కేటాయించాలి: అశ్వక్‌ఖాన్

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ సీటు మైనార్టీలకు కేటాయించాలని టీపీసీసీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ అశ్వక్‌ఖాన్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. అక్బర్‌బాగ్‌లోని తన నివాసంలో ఆయన గురువారం మైనార్టీ విభాగం చైర్మన్ ఖాద్రీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మలక్‌పేట నుంచి తనకు అవకాశం కల్పించాలని టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 2009 నుంచి ఆయా ఆ పార్టీలు మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థిని బరిలోకి దింపలేకపోయారన్నారు. మలక్‌పేటలో కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటింగ్ శాతం ఉందని, మజ్లిస్, బీఆర్ఎస్ స్నేహపూర్వక పోటీలో భాగంగా నాన్‌ముస్లిం ఓట్లు చీల్చడానికి బీఆర్ఎస్ డమ్మీ అభ్యర్థులను నిలబెడుతోందన్నారు. మజ్లిస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకే తాను ముక్కలన్నారు. మజ్లిస్ పార్టీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్ మాత్రమే ఉందని, అందుకే మైనార్టీలకు మలక్‌పేట సీటు ఇవ్వాలని కోరారు. మైనార్టీలకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అశ్వక్‌ఖాన్ ధీమా వ్యక్తం చేశారు.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

హస్తినాపురం: 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న ఓటును తప్పకుండా వినియోగించుగించుకోవాలని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహపురం కాలనీ టీఎస్ఆర్ సులక్షణ అపార్ట్‌మెంట్‌లో కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో ఓటర్‌నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ఆర్ సులక్షణ అపార్టుమెంట్ అధ్యక్షుడు అంబటి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రఘుమారెడ్డి, గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రచ్చ సంతోష్, శేఖర్‌గౌడ్, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ లీకేజీతో ప్రమాదాలు



తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా ధ్వంసమైన రోడ్డు

హయత్‌నగర్: హయత్‌నగర్ నుంచి తొర్రూరు వెళ్లే దారిలో హయత్‌నగర్ జీ స్కూల్ మలుపు వద్ద ప్రధాన తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత కాలంగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు మూల మలుపు వద్ద ఏర్పడ్డ గుంతను గమనించకపోవడంతో ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి ప్రమాదాల బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



చంచల్‌గూడ: మాదన్నపేట వినాయకనగర్ బస్తీలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలి సంఘం భవన్‌లో పద్మశాలి కులస్తులు మార్కండేయ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. పద్మశాలీలు తమ కులదైవం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గాయత్రి యజ్ఞం, సామూహిక రక్షాబంధనంతో గణపతిపూజ, మహాలక్ష్మీ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుద్యాల శివశంకర్, ప్రధాన కార్యదర్శి జిల్లా విజయ్‌కుమార్, స్థానిక నాయకులు రాముారి మల్లేశం తంగెళ్ల సు. దీర్ పాల్గొన్నారు.

వేధింపుల కేసులో 8 రోజుల జైలు

చంచల్‌గూడ: మహిళను వేధించిన ఓ యువకుడికి నాంపల్లి కోర్టు 8 రోజుల జైలు శిక్ష విధించింది. మాదన్నపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట బస్తీలో స్థానికులతో అసభ్యంగా వ్యవహరిస్తున్న శ్రీకాంత్ (30)పై పోలీసులకు ఫిర్యాదు అందడంతో అతని ఈ- పెట్టీ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లక్ష్మణరావు నిందితుడికి 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు



సోదరులకు రాఖీ కట్టిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి



రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుకు రాఖీ కడుతున్న సోదరీమణులు



మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు

వెల్లివిరిసిన అనురాగ బంధం

వైభవంగా రక్షాబంధన్ వేడుకలు

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం: సోదర సోదరీమణుల ఆప్యాయత, అనురాగ బంధాలకు నిదర్శనంగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో గురువారం వైభవంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం తమ అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టి, స్వీట్లు తిపించగా..., సోదరులు తమ సోదరీమణులకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని, ఎప్పుడూ ఆనందోత్సాహాలతో ఉండాలని దీవించి కానుకలు అందజేశారు. రాఖీ పండుగకు పుట్టింటికి వచ్చిన తోబుట్టువులతో ప్రతి ఇంట్లో సందడి నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఇతర రాజకీయ నాయకుల ఇళ్లలోనూ పెద్ద ఎత్తున రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.



ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి రాఖీ కట్టిన కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త అఖిల సాగర్



బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌కు రాఖీని కడుతున్న సోదరి



దిల్‌సుఖ్‌నగర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



మలక్‌పేట ఎమ్మెల్యే బలాలకు రాఖీ కడుతున్న నాయకురాలు లక్ష్మి

చెరువు స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలి



భవన శిథిలాలతో పూడ్చేస్తున్న పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువులో కొంతమంది భవన శిథిలాలు వేసి పూడ్చేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారని, కబ్జా కాకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. పెద్దచెరువును పూడ్చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పెద్దచెరువు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. పెద్దచెరువులోని ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో గతంలో ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా అడ్డుకున్నానని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో భవన శిథిలాలను వేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని మండిపడ్డారు. ఇరిగేషన్ అధికారుల అండతోనే కబ్జాదారులు కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జాదారులకు గుర్తించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా చెరువు ఎఫ్‌టీఎల్ స్థలం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సుభద్రానగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కాలనీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరగోపాల్, కాలనీ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పద్మజ, మదన్‌మోహన్ రావు, స్వర్ణలత, రాఘవరెడ్డి, నరసయ్య, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.



సుభద్రానగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

క్రీడాకారుల సమస్యలపై పోరాటం

హుడాకాంప్లెక్స్: ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ మెంబర్‌గా నందునాయక్ నియమితులయ్యారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా రాజేష్ అధ్యక్షతన ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగింది. గురువారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ స్పోక్స్‌పర్సన్ దాసోజు శ్రవణ్ హాజరై నందునాయక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు అంటే భారతదేశానికి ఒక వెన్నుముక అని చాటి చెప్పడానికి, క్రీడాకారులకు అన్యాయం జరిగితే స్టూడెంట్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఉందని మనోధైర్యం నింపడానికి ఆర్గనైజేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించేందుకు స్టూడెండ్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు నందునాయక్ కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న నందునాయక్

తెలంగాణ భావ్‌సార్ క్షత్రియ మహిళా పరిషత్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కాచిగూడ: తెలంగాణ భావ్‌సార్ క్షత్రియ మహిళా పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక కాచిగూడ, సుందర్‌నగర్‌లోని భావ్‌సార్ భవన్‌లో గురువారం జరిగింది. అధ్యక్షురాలిగా విజయలక్ష్మి సూత్రవే, ప్రధానకార్యదర్శిగా సంగీత పాటాలేతో పాటు వివిధ పదవులకు మహిళలు ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సమాజ భూషణ్ రాజశ్రీ సూత్రవే, వసంత బగాడే, ఉమా రతన్ పాల్కే, అరుణ్‌జ్యోతి లోఖండే, అనితా లోఖండే, స్వర్ణ భాండేకర్ తదితరులు మాట్లాడారు. వివిధ జిల్లాలకు చెందిన మహిళా ప్రతినిధులు మరాఠీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నల్లకుంట: పౌర్ణమి సందర్భంగా గురువారం నల్లకుంట శంకర మఠంలోని శారదా మాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుల మంత్రోచ్ఛరణల నడుమ చండీ హోమం నిర్వహించారు. నవధాన్యాలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. అలాగే ఆలయంలోని అమ్మవారికి చండీ పూజలు చేశారు. పూజల్లో శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు దంపతులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పర్యావరణానికి పెద్దపీట వేస్తూ..

45 అడుగుల మట్టి వినాయక విగ్రహం తయారీ



బాలాజీ నగర్‌లో తయారు చేస్తున్న మట్టి వినాయక విగ్రహం వద్ద తిరంగ యూత్ అసోసియేషన్ సభ్యులు

నాగోలు: ఎల్బీనగర్ పరిధిలోని కొత్తపేట డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో గణపతి నవరాత్రుల కోసం తిరంగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహం లక్ష్మీ సరస్వతి సహిత వేంకటేశ్వర మహాగణపతి రూపంలో తయారు చేస్తున్నారు. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ ఎటువంటి కెమికల్స్ వాడకుండా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండటంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరంగ యూత్‌కు ఇది 17వ వార్షికోత్సవం.

పదేళ్లుగా ఏర్పాటు...

గత 10 ఏళ్లుగా వీరు మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా 3 ఏళ్లుగా వరుసగా 36, 41, 45 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ కలుష్య నివారణకు తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ భారీ విగ్రహాన్ని బోర్ మోటార్, ఫైర్ ఇంజిన్ సహాయంతో అక్కడే నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జనం తరువాత విగ్రహానికి వాడిన మట్టిని చుట్టు పక్కల ప్రాంతాల వారు తీసుకెళ్లి వారి వారి పెరట్లో, పంట పొలాల్లో వేసుకుంటున్నారు. మిగిలిన గడ్డి, ఇతర వస్తువులను లారీలో తీసుకెళ్లి నదిలో వేస్తున్నారు. కొత్తకోట ప్రముఖ కళాకారుడు నగేష్ తో విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. యూత్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్నబోయిన సాయి ముదిరాజ్, బద్కా రమేష్, సోని రోహిత్, వెంకటేష్ , శ్రీవాస్తవ్, ప్రవీణ్ గౌడ్, హరీష్, సీను, శివ గౌడ్‌లు నెల రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ వహించి విగ్రహాన్ని తయారు చేయించి గణపతి నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

ఘనంగా గాయత్రిధారణ మహోత్సవం



శ్రీరామ్‌నగర్‌లోని గాయత్రిధారణ పూజలో పాల్గొన్న పద్మశాలి సంఘం నేతలు

మన్సూరాబాద్: పద్మశాలి సంఘం మన్సూరాబాద్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గాయత్రిధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి పూజ నిర్వహించి గాయత్ర ధారణ చేశారు. అలాగే, సహారా స్టేట్స్ కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రి ధారణ చేశారు.

థాయ్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు



విద్యార్థి ఇంకెషాఫ్ మెహదీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మలక్‌పేట: ప్రపంచ స్థాయి థాయ్ బాక్సింగ్ పోటీలకు గడ్డిఅన్నారం నారాయణ పాఠశాల విద్యార్థి ఇంకెషాఫ్ మెహదీ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి 22 మంది జట్టు ఎంపికగా..వారిలో ఇంకెషాఫ్ మెహదీ జట్టు సభ్యుల్లో ఒకరని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థ తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. .

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు, మహిళలు

కాచిగూడ: మహిళలకు కేంద్ర ప్రభుత్వం సిలిండర్ పై రూ.200 రాయితీ ఇవ్వడం గొప్ప పరిణామం అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు కలిసి పాలాభిషేకం చేశారు. దేశంలోని మహిళల అభివృద్ధికి, సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గౌతంరావు తెలిపారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.వినోద్ యాదవ్, కేశబోయిన శ్రీధర్, నీరజ, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై అడ్డగోలుగా ర్యాంపుల నిర్మాణం

- కుచించుకు పోతున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వనస్థలిపురం: ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లపై అడ్డగోలుగా నిర్మిస్తున్న ర్యాంపుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఒక నిర్దిష్టమైన పద్ధతి లేకుండా రోడ్లపైకి ర్యాంపుల నిర్మిస్తుండటంతో చాలాచోట్ల రోడ్లు ఇరుకుగా మారి ఆ దారిన వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ర్యాంపుల నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, కాలనీ సంక్షేమ సంఘాలు గానీ పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇళ్ల యజమానులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

- బస్సులు తిరిగే రహదారులతో పాటు, కాలనీల్లో రోడ్ల వెంబడి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మిస్తుండటంతో వాటి ర్యాంపులు, మెట్లు, రెయిలింగ్‌లు రోడ్డుపైకి వస్తున్నాయి.
- రోడ్డుకు సమాంతరంగా ఇళ్లు నిర్మిస్తే భవిష్యత్‌లో రోడ్డు ఎత్తును పెంచితే దిగువకు అవుతాయనే ఉద్దేశంతో నిర్మాణదారులు చాలా ఎత్తులో ఇళ్లను నిర్మిస్తున్నారు. దీంతో వారి వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లాలంటే ర్యాంపులు నిర్మించుకోవాల్సి వస్తోంది.
- అయితే గేటు లోపలి వైపు ర్యాంపులను నిర్మించుకోవడానికి బదులు గేటు నుంచి రోడ్డుపైకి ర్యాంపులను నిర్మిస్తుండటంతో ఎత్తునుబట్టి ఒకోచోట రోడ్డు మధ్యవరకు ర్యాంపులు వస్తున్నాయి.
- దీనికి తోడు గ్రీనరి పేరిట ప్రహరీనుంచి 3, 4 ఫీట్ల మేర వెడల్పులో అడ్డుగోడలు నిర్మిస్తుండటంతో రోడ్డు కుచించుకుపోతోంది.
- రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల యజమానులు ర్యాంపులు, గ్రీనరీ ఏర్పాటు చేస్తుండటంతో 20 ఫీట్ల రోడ్డు కాస్తా 10 ఫీట్ల మేర మూసుకుపోతోంది. ఫలితంగా ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఇక ఉన్న 10 ఫీట్ల రోడ్డులో సైతం వారు తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇక దారి నుంచి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. దీంతో సదరు ఇళ్ల యజమానులు, వాహనదారుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి.



హయత్‌నగర్ డివిజన్ సుభద్రానగర్‌లో రోడ్డుపైకి వచ్చిన మెట్లు, రెయిలింగ్‌లు

రోడ్డు లెవెలింగ్ తెలియనందు వల్లే...

పలు డివిజన్లలో చాలా కాలనీలు ఇపుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. చాలా చోట్ల ఇంకా పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు భవిష్యత్‌లో తమ ఇంటి ముందు రోడ్డును ఎంత ఎత్తులో నిర్మిస్తారో తెలియక ముందు జాగ్రత్తగా అవసరమైన దానికన్నా ఎత్తులో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇళ్లు ఎత్తులో ఉండటంతో వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లడానికి వీలుగా ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నారు. అయితే పెద్ద ర్యాంపు నిర్మించాల్సివస్తే ఇంటి లోపటి నుంచి ర్యాంప్‌ను నిర్మించుకోవాలి తప్ప గేటు వద్ద నుంచి రోడ్డుపైకి నిర్మించవద్దని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సూచిస్తున్నారు.

కాలనీల్లో భారీ ర్యాంపులు నిర్మించరాదు...

కాలనీ రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి ర్యాంపులు, నిర్మాణాలు చేపట్టరాదని పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు అంటున్నారు. ఈ మేరకు ఆయా కాలనీ సంక్షేమ సంఘాల సమావేశంలో తీర్మానం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన చోట ఇల్లు, అపార్ట్‌మెంట్, దుకాణాల ముందు ర్యాంపులు ఎట్టి పరిస్థితుల్లో 3 అడుగులకు మించరాదని, రోడ్డును ఆక్రమించి నిర్మించే ర్యాంపులు, నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో రోడ్డు మధ్య వరకు వచ్చిన ర్యాంపు